క్లుప్తంగా

మూడు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: తాగునీటి పైపులైన్ మరమ్మతు పనుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి ఓ ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట్ వద్ద కొత్త పైపులైన్ వేస్తున్నారని, ఈ క్రమంలో మార్చి 8, 9, 10 తేదీల్లో కొంపల్లి మున్సిపల్ పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు 'వైద్య నేస్తం' మెడికల్ క్యాంప్

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని సుందరయ్య భవనంలో ఆదివారం 24వ వైద్య నేస్తం మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో బీపీ, షుగర్‌తో పాటు ఇతర సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. డాక్టర్లు సూచించిన మందులను రూ.100కే అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా 'వీఆర్‌ఎస్ విజ్ఞాన జ్యోతి' వార్షికోత్సవం



విద్యార్థుల నృత్య ప్రదర్శన

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞాన జ్యోతి ప్రాథమిక పాఠశాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సంస్కృతిక, రొబోటిక్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా విద్య, ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పాసింగ్ ఔట్ పరేడ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు



బీట్ అఫీసర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు..

సుభాష్‌నగర్: దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ అకాడమీ 32వ బ్యాచ్ బీట్ ఆఫీసర్ల పాసింగ్ ఔట్ పరేడ్ శనివారం ఘనంగా జరిగింది. గత సెప్టెంబర్ 5న ప్రారంభమైన ఆరు నెలల శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఇక్కడ శిక్షణ పొందిన 78మంది బీట్ ఆఫీసర్లలో 13 మంది మహిళా అధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాన అటవీ సంరక్షణాధికారి ఎలుసింగ్ మేరు హాజరయ్యారు. కోర్సు డైరెక్టర్ సి.హెచ్.గంగారెడ్డి నివేదికను సమర్పించారు. పాసింగ్ ఔట్ పరేడ్ అనంతరం జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని వన్యప్రాణి విభాగానికి చెందిన కె.మోహన్‌రావు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి 81 శాతం మార్కులతో రెండు బంగారు పతకాలను సాధించడంతో పాటు ప్రథమ స్థానంలో నిలిచారు. ఎం.భైరు బాయి, ఇ.నరేష్, కృష్ణగౌడ్, రతన్ రిచర్డ్స్, కె.పవన్‌కుమార్, విశ్వజిత్, నవీన్‌కుమార్, వెంకటేష్ ఒక్కో బంగారు పతకం సాధించారు. కార్యక్రమంలో పీవీ రాజారావు అకాడమీ మాజీ సంచాలకులు జి.నర్సయ్య, ఉన్నతాధికారులు ప్రదీప్, జి.రవిందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



మంత్రి సత్యనారాయణ కార్పొరేటర్ సూరారం కాలనీ..

కుత్బుల్లాపూర్: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, వచ్చే మూడేళ్లలో సూరారం డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన తన రెండేళ్ల పాలనా కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలు, ఇబ్బందులు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై 'సాక్షి'తో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు కాలనీలు, మురికివాడల్లో నెలకొని ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. కమ్యూనిటీ భవనాల నిర్మాణం వేగవంతం చేస్తానని, సిమెంట్ రోడ్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు.

- మంత్రి కేటీఆర్ హామీతో తాను కార్పొరేటర్ గా బాధ్యతలు చేపట్టిన సమయంలో టీఎస్ఐఐసీ కాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకున్నానన్నారు. సుమారు 1625 గజాల్లో రూ.మూడు కోట్లతో భవన నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఇదే ప్రాంతంలో రూ.3.5 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన పార్కును మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు తెలిపారు. నిధుల మంజూరు విషయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు.
- డివిజన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీ, శ్రీకృష్ణ నగర్, లక్ష్మీ నగర్, మస్తానా బిల్డర్, అయ్యప్ప సొసైటీ, హనుమాన్ కాలనీ, శివాలయ నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేశామని, రూ. 100 కోట్లతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.
- శ్రీరామ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభయ్యాయని, పనులు పూర్తి కాగానే సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే అధికారులతో ప్రణాళికలు రూపొందించామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. శివాలయ నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుపై ఇప్పటికే వాటర్ వర్క్స్ అధికారులతో చర్చించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.
- ప్రజల అవసరాల కోసం సంక్షేమ సంఘాల సూచన మేరకు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి పెద్దపీట వేశామని విశ్వకర్మ కాలనీ, టీఎస్ ఐఐసీ కాలనీ, మార్కండేయ నగర్ ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయని ఆయన వివరించారు.

ప్రజా సంక్షేమమే పరమావధి

నిజాంపేట్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నానని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కావ్య ఎవెన్యూ కాలనీకి చెందిన సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్‌ను కలిసి ఈ నెల 12న కాలనీ పార్కులో జరిగే జనరల్‌బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేందర్, కాలనీ అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రసన్న బాబు, రామకృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న కావ్య ఎవెన్యూ కాలనీ సభ్యులు

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యలను వివరిస్తున్న ప్రజలు..

దుండిగల్: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని, బీఆర్‌ఎస్ పాలన పట్ల రాష్ట్ర ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శనివారం ఎమ్మెల్సీని కలిసి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్‌గా నియమితులైన సందర్భంగా పలువురు శంభీపూర్ రాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ అధ్యక్షులు సోమేశ్ యాదవ్, విజయ్ రామ్ రెడ్డి,రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలె శ్రీకాంత్, వడ్డెర సంఘం అధ్యక్షులు ఎత్తరి మారయ్య, మాజీ మేడ్చల్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ నాగరాజ్ యాదవ్, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్, జిన్నారం వెంకటేశం, ధర్మ రెడ్డి, ప్రభాకర్ గుప్త ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు.

కరెంట్ షాక్‌తో నలుగురికి గాయాలు

ఫ్లెక్సీని సరి చేస్తుండగా ఘటన

కుత్బుల్లాపూర్: ఫ్లెక్సీని సరి చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి సినీ ప్లానెట్- ఎన్‌సీఎల్ నార్త్ రోడ్డులో సాయి చైతన్య జూనియర్ కళాశాలలో గురువారం మధ్యాహ్నం కళాశాల సిబ్బంది విజయ్, ఉపేందర్, లక్ష్మణ్ కళాశాలకు చెందిన ఫ్లెక్సీ ఊడిపోతే దానిని సరి చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కళాశాల భవనంపై నివాసముంటున్న డ్రైవర్ క్రాంతిని సహాయం కోసం పిలిచారు. క్రాంతి వీరికి సహకరిస్తుండగా ఒక్కసారిగా గాలి రావడంతో ఫ్లెక్సీ ఎగిరి సమీపంలోని 11 కేవీ విద్యుత్ తీగలను తాకింది. ఈ ఘటనలో ఫ్లెక్సీని పట్టుకుని ఉన్న నలుగురు వ్యక్తులకు కరెంట్ షాక్ తగిలింది. ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, డ్రైవర్ క్రాంతి తీవ్రంగా గాయపడ్డాడు. కళాశాల యాజమాన్యం బాధితులను సమీపంలోని హర్ష హాస్పిటల్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన క్రాంతిని రష్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా అతని పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు వృథా



రోడ్డుపై వృథాగా పారుతున్న నీళ్లు

జగద్గిరిగుట్ట: కొన్ని వందల కిలోమీటర్ల నుంచి గ్రేటర్ నగరానికి వస్తున్న గోదావరి నీళ్లు జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో లీకేజీల కారణంగా వృథాగా పోతున్నాయి. రహదారులు జలమయం కావడంతో సోమయ్యనగర్, మైసమ్మనగర్, షిరిడి హిల్స్, అంజయ్యనగర్, జగద్గిరినగర్, రింగ్‌బస్తీ, శ్రీనివాసనగర్ ప్రధాన రహదారుల్లో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం సోమయ్య నగర్ ప్రధాన రహదారిలో లీకేజీ కారణంగా నీరు వరదను తలపించింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్‌లో ఈ నెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు మహిళలకు ఆటలు, పాటలు, డాన్సులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు 8న ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆదివారం రంగోలి, సోమవారం కబడ్డీ, మంగళవారం మ్యూజికల్ చైర్, బుధవారం డాన్స్, పాటలతో పాటు తదితర పోటీలు ఉంటాయన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



చింతల్: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, పట్టుదలతో చదివితే భవిష్యత్‌లో రాణిస్తారని నవజ్యోతి విద్యాసంస్థల చైర్మన్, కరస్పాండెంట్ మలిరెడ్డి ఇందిరారెడ్డి అన్నారు. శనివారం చింతల్ డివిజన్ వైఎంఎస్ కాలనీలోని పట్వారి బ్రాంచ్ పాఠశాలలో వార్షికోత్సవ (రిథమ్ 2023) వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. వన్ లెర్న్ ప్రతినిధి దుష్యంత్, క్వీన్ ఇంగ్లీష్ ప్రతినిధి సందీప్ మల్లారెడ్డి ,ప్రముఖ విద్యావేత్త ముప్పాళ్ల సుబ్బారావు, పాఠశాల కరస్పాండెంట్ మలిరెడ్డి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్ ఆదిత్య కృష్ణ, బి.రూపాంజలితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల సత్తా విద్యార్థులకు ఉందన్నారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, అప్పుడే వారి కలలు సాకారమవుతాయని తెలిపారు. తమ అధ్యాపక బృందం సమష్టి కృషితో ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆహుతుల్ని అలరింపజేశాయి. అతిథులు దుష్యంత్, సందీప్ మల్లారెడ్డి, ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ విద్యతోనే విశ్వాన్ని జయించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

కుత్బుల్లాపూర్: పీఆర్సీ అమలు చేయాలని, జీపీఎఫ్, ఈపీఎఫ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం వెన్నెలగడ్డలోని మేడ్చల్ జిల్లా డివిజనల్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మేడ్చల్ సర్కిల్ రెండో రోజు భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగుల నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ అమలు చేయడంతో పాటు విద్యుత్ ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. 6న యాజమాన్యం చర్చలకు పిలిచిందని, తదనంతరం తమ భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. 8న జరిగే రిలే హంగర్ స్ట్రైక్‌లో మేడ్చల్ సర్కిల్ పరిధిలోని ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ వెంకన్నగౌడ్, 327 యూనియన్ స్టేట్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, 1104 రీజినల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, మియాపూర్ సెక్షన్ ఈడీ, ఓసి అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, మేడ్చల్ జోన్ సెక్రటరీ శివశంకర్, వివిధ యూనియన్ల అసోసియేషన్ నాయకులు రామస్వామి నారాయణస్వామి, శ్రీరామ్, అశోక్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలి

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌పై వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ విచారణ జరిపించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు సంబంధించి ఓ ఆడియో వైరల్ కావడంపై శనివారం సీపీఐ నాయకులు జగద్గిరిగుట్టలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పలు వివరాలు వెల్లడించారు. కొందరు వ్యక్తులు అధికార పార్టీ నాయకులు అండదండలతో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేదలు ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని వాటిని అధికారులు కూలగొట్టడం సమంజసం కాదన్నారు. అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న అధికారులపై కలెక్టర్ విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మండల సహాయక కార్యదర్శి దుర్గయ్య, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, సహదేవ్‌రెడ్డి, వెంకటేష్, ఇమామ్, నరేంద్రచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు..

పన్నులను వెంటనే తగ్గించాలి

నిజాంపేట్: పెంచిన పన్నులను వెంటనే తగ్గించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు .శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 3,4,5 అంతస్తుల్లోని ప్లాట్‌లకు ఆస్తి పన్ను రెండింతలు పెంచారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెంటనే పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటైన ఏ ఒక్క కార్పొరేషన్‌లో పన్నులు పెంచలేదని, తక్షణమే పెంచిన పన్నులను తగ్గించాలని కోరారు. పెంచిన ఆస్తి పన్ను తగ్గిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేసి మున్సిపల్ మంత్రి కేటీఆర్‌కు పంపాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మేయర్‌లను డిమాండ్ చేశారు.25 రోజుల్లో పన్నులను తగ్గించకపోతే కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా.ఎస్ మల్లారెడ్డి, అమలేశ్వరి,దాసి నాగరాజు, కాశీ, భిక్షపతి యాదవ్,నరేంద్ర ,రాము, అశోక్ నాయక్, ప్రసాద్ రాజు, మదన్ గౌడ్, సంతోష్, డాక్టర్ శ్రీనివాస్, ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు